# "ఇక్కడకాదు - లోపల...."

రచన :
... "వాసోక్టి" ...

"శశీ! నేను ధర్మవరం క్యాంపు వెడుతున్నా. తిరిగివచ్చేందుకు కనీసం పదిరోజులైనా పట్టచ్చు!" అన్నాడు ఇంజనీరు నీలకంఠం, భార్య శశిరేఖతో.

శశి ఏమీ మాట్లాడలేదు. అసలు మాట్లాడేందుకు యేంవుంది? ఒకవేళ తను నోరువిప్పి 'మీరు వెళ్ళకండి' అంటేమాత్రం అతను ఆగిపోతాడా? ఆగిపోయేందుకయినా వీలవుతుందా ఇప్పుడు ఇదేమీ కొత్తగాని అప్రస్తుతముగాని కాదుగా! తనకి పెళ్ళయి దాదాపు రెండేళ్ళు కావస్తోంది. అప్పట్నించీ యిదే వాలకం. తను ఎక్కడికో ఉద్యోగరీత్యా వెళ్ళాలంటాడు. తను బట్టలూ అవీ సర్ది పెట్టేది. అంతే—అతను మరేమీ మాట్లాడకండా వెళ్ళిపోయేవాడు.

అతను మళ్ళీ అన్నాడు—

"నేను మొదటిరైలుకే వెళ్ళాలి. కాస్తా బట్టలూ అవీ సర్ది పెడుదూ!" అంటూ అతను వేసికొన్న దుస్తులువదిలి స్నానాల గదిలోకి వెళ్ళాడు.

శశి భర్తబట్ట సర్దేందుకు పక్కగదిలోనికి వెళ్ళింది. ఈ రెండేళ్ళలో ఆమె యిదేపనిని కొన్నివందలసార్లు చేసింది. కాని ఎప్పుడూ విసుక్కునేదికాదు.

కాని ఈ రోజుమాత్రం అకారణంగా, కాదు హఠాత్తుగా హృదయంలో యేదో వ్యక్తంకానిబాధ చెలరేగింది. ఆ బాధని తన్నించి దూరంచేసికోవాలన్నా సాధ్యం కావడంలేదు.

ఏదోవిధంగా లెదర్ బాక్సులో భర్తవి రెండుమూడు జతల బట్టలుసర్ది, వెళ్ళి పడక మీద పడుకొంది.

నీలకంఠం సూటుకేసు తీసికెళ్ళేందుకు గదిలోకివచ్చి, వేళకానివేళలో శశి పడక మీద పడుకొనివుండడంచూసి, కొంచెం ఆశ్చర్యపడి "ఏమైందేవిటి?" అన్నాడు.

"ఏమీ కాలేదు. తల కొంచం పోటుగా వుంది అంతే" అని గోడపక్కకి వత్తిగిల్లి పడుకుంది.

నీలకంఠం మరేమీ మాట్లాడలేదు.

"అయితే నే వెడుతున్నాను. వచ్చి తలుపేసుకో" అంటూ వెళ్ళిపోయేడు.

శశి వెళ్ళి తలుపు ఫెడేలుమనివేసి (శబ్దం తనభర్తకి వినబడేలా!) వచ్చి పడకపై పడుకొని కళ్ళుమూసుకొంది.

కోపంతో శశి హృదయం భగ్గుమంది. కళ్ళు నెత్తురుకక్కాయి. ముఖం వికారంగా జేవురించుకపోయింది.

ఇంతకుముందు శశి భర్తతో, తలపోటని అబద్ధమాడింది. కాని, ఈసారి నిజంగానే తలపోటు వేయసాగింది. దాంతో పాటు అంతులేని ఆలోచన్లతో బుర్ర బరువెక్కింది కాని బ్రద్దలుకాలేదు.

నీలకంఠం పాకాల రైల్వే డిస్ట్రిక్టుకి అసిస్టెంటు ఇంజనీరు. తన నలభై అయిదోయేట తన మొదటిభార్య సుగుణ చనిపోయింది. పతీ వియోగంతో అతను హృదయం బ్రద్దలయ్యేలా దుఃఖించలేదు. వేదనాభారంతో తల బద్దలుకొట్టుకోనూలేదు. పైగా తనపై వున్న కొంత బరువూ, చింతా తొలగిపోయినట్లయింది. పెళ్లయింది మొదలుకొని సుగుణ తీరనిరోగాలతో అతను విసిగెత్తిపోయాడు. అంచేతే ఆమెపోయిందే తనకు కొంత మేలైనట్లు తలపోసేడు.

సంవత్సరం తిరక్కముందే నీలకంఠం శశిని రెండో పెళ్ళాంగా స్వీకరించేడు. శశికి పద్ధెనిమిదేళ్ళుంటాయి. మనిషి కొంచెం అందగత్తెకూడా. వంపులు తిరిగి ఆకర్షవంతంగా వుండే ఆమె అవయవసృష్టితోకాని పొంగులెత్తే ఆమె యౌవనపు మాధుర్యంతోకాని నీలకంఠానికి యేలాంటి అవసరమూలేదు. ఆమె కళ్ళలోని చంద్రకాంతులు, శరీరమెలికల్లోని శిల్పం, నవ్వుల్లోని కవిత్వం అతను చూడలేకపోయాడు. అతనిలో ఆ శక్తి నశించిపోయింది. ఆమెని సుఖపెట్టేందుకు, తృప్తిపరిచేందుకు అతనెప్పుడూ ప్రయత్నించలేదు. కనీసం ఆలోచించనైనాలేదు.

నగలు నాణ్యాల్లో కాని, బట్టల్లో కాని అతను శశికి యెల్లాంటిలోటు రానివ్వలేదు. శశికోరిందికోరినట్టే మారుమాట్లాడకండా కొని తెచ్చేవాడు. ఆమెక్కావల్సింది అంతే—ఇంకేమీ అక్కర్లేదేమో అనుకునేవాడు. కాని మగువ మనస్సు వీటితోనే తృప్తిపడుతుందా? వీటితోనే సంతోషించి తన కోర్కెల్ని, వాంఛలనీ చంపుకుంటుందా? స్త్రీ ముఖ్యంగా దేన్ని వాంఛిస్తుందో, దేనికోసమయితే యెంత సాహసానికయినా, త్యాగానికైనా వెనుతీయదో దాన్ని గుర్తించలేకపోయాడు నీలకంఠం. బహుశా గుర్తించినా యేమీ చెయ్యలేకపోయేవాడేమో!

నీలకంఠం నెలకు యిరవై అయిదు రోజులకిపైగా క్యాంపులకని, సూపర్ వైజింగులకని బయట తిరుగుతూవుంటాడు. ఇంటివద్దనున్న రెండుమూడు రోజుల్లోనూ అంటే తన ఆఫీసు గదిలో కూర్చుని, కార్డుబోర్డులపై పెద్దపెద్ద ప్లానులు గీస్తూ గడిపేవాడు. రాత్రి చాలా పొద్దుపోయేవరకు లావులావుటి బైండు పుస్తకాలు చదువుతూ వుండేవాడు. కాని ఇంట్లో వున్న పడుచుపెళ్ళాం మెత్తని పట్టు పరుపు మీద పడుకొని మదనతాపంతో యెంతగా కుమిలిపోతూవుందో ఆలోచించేవాడుకాదు. అతనిక్కావల్సిందల్లా ఒక్కటే—పెళ్ళాం లేనిస్థానంలో మరో పెళ్ళాం!

ఇంతసేపూ శశి దీన్నిగురించే ఆలోచించసాగింది. తనకు ముసలిమొగుడు దొరికాడని ఆమె దుఃఖించడంలేదు. పడుచుభర్తకోసం ప్రాకులాడలేదు. వున్నభర్త (ముసలివాడైనా సరే!) తనవాంఛల్ని అర్థంచేసికొని, తనని

తృప్తిపరిచేందుకు ప్రయత్నించడంలేదే అని ఆమె వ్యథపడసాగింది. ఆలోచించేకొద్దీ తన జీవితం నిబిడాంధకారంతో నిండిన అనంతమయిన యెడారిమయంగా కనిపించింది. తన భర్త ఎడారిలో ప్రయాణికుల్ని మోసే ఒంటెల్లాంటివాడు. ఇంక తను ఓ యాసిస్సుకోసం వెతుక్కోవాలి.

గోడగడియారం ఆరుసార్లు కొట్టింది... పడమట చెట్లచాటుగా నీలికొండల వెనకా సూర్యుడు నిష్క్రమిస్తున్నాడు. తెఱచిన కిటికీలగుండా సంధ్యాభానుని అరుణకిరణాలు గదిలోని గోడలపై, బీరువాలపైబడి ప్రతిఫలిస్తున్నాయి. చల్లగా, మెల్లగా వీచే పిల్లవాయువులతోపాటు, పక్క తోటలోంచి వచ్చే మల్లి-విరిజాజుల సుగంధ పరిమళం మనస్సును పులకరింపచేస్తున్నాయి. కోర్కెలని రేపుతున్నాయ్.

సరిగ్గా యీ సమయంలో బయట ఎవరో తలుపుతట్టేరు, 'అమ్మగారూ! అమ్మగారూ!' అంటూ.

పనిమనిషి—సీత యింట్లో లేదు. పెరట్లో యెక్కడో పనిచేసుకుంటుందల్లే వుంది.

శశి స్వయంగా వెళ్ళి తలుపుతీసి వాకిట్లో వున్న వ్యక్తినిచూసి 'యేంకావాలి?' అంది.

ఆ వచ్చిన వ్యక్తికి పాతికేళ్ళుంటాయి. మాంచి వొడ్డూ పొడుగూ వున్నాడు. బాగా కష్టపడ్డంచేత కామాలు కండలుతిరిగి బలిష్ఠంగా వున్నాడు.

అతనన్నాడు. "అయ్యగారు బండికెదుతూ నన్ను ఇంటిపద్ద పన్లు చూస్తూండమని—రాత్రిళ్లు యిక్కడే పడుకోమనిచెప్పి వెళ్ళారండీ!"

"ఇంతకుపూర్వం యిక్కడ పనిచేస్తూన్న వెంకడు యేమయ్యాడు?" అంది ప్రశ్నార్థకంగా ముఖంపెట్టి.

"వాన్ని గ్యాంగిలోకి మార్చి - నన్ను గ్యాంగిలోంచి యిక్కడే వేసారండి!"

"సర్లే! ఇప్పుడు అవసరమయిన పనులేవీ లేవు. భోజనంచేసేక రాత్రి యీ వరండాలోవచ్చి పడుకో!"

"చిత్తం! అల్లాగే!" అని వెళ్ళిపోయేడు.

* * *

రాత్రి పదకొండుగంటలయింది. వాతావరణం ప్రశాంతంగా వుంది. ప్రపంచమంతా మంచి నిద్రావస్థలోనున్న సమయం! వెన్నెల రోజులయినా ఆకాశం మబ్బులుపట్టడంచేత కటికచీకటిగా వుంది.

శశికి కునుకుపట్టలేదు. తీరని ఆలోచనలతో హృదయం జ్వలించిపోతూంది. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు.

తన హృదయంలో ఏదో సముద్రఘోష బయలుదేరింది. ఈ రెండేళ్ళుగా తన హృదయంలోపలే కృంగి, కృశించి, నశించిపోయిన వాంఛలన్నీ, వువ్వెత్తుగా పొంగే కెరటాల్లా విజృంభించసాగేయి.

సాయంత్రం ఆరున్నర గంటలకి సీత పని ముగించుకొని, తన చిన్నకూతురికి జబ్బుగా వుందని వెళ్ళిపోయింది. రాత్రి ఎనిమిదిగంటలవుతూందనగా జయరాం (కొత్తగా పనికి వచ్చిన వ్యక్తి) వచ్చి బయటి వరండాలో పడుకున్నాడు.

బయట సన్నగా తుంపరపడ్డం ప్రారంభమైంది. రివ్వునవీచే చలిగాలితోపాటు వానజల్లు తెరిచిన కిటికీగుండా గదిలో పడుతూ వుంది.

ఈ సమయంలో—ఈ యేకాంతవాసంలో నవయౌవనపు పొంగులతో, పురుష స్పర్శ యెరుగని యువతి, బయట నరాల పటుత్వమున్న పాతికేళ్ళ యువకుడు.

శశి పడకమీదకూర్చుని ఒక్కసారి బద్ధకంగా వల్లు విరుచుకొంది. ఇంతసేపు తన హృదయంలో రేగిన తుఫానుకి బదులుగా చివరికీనిర్ధారణకొచ్చింది. ఆమె మనసులో యెల్లాంటి ఆలోచనా భయాలకి చోటులేకపోయింది. మంచీ-చెడూ, పాప-పుణ్యమూ, నీతీ-అవినీతీ అనే విచక్షణాజ్ఞానం ఆమెలో నశించిపోయింది. ఆమె దృష్టిలోవున్నదల్లా ఒక్కటే! తనకి అయాచితంగా లభించిన అమృతకలశాన్ని యెందుకు తన స్వహస్తాలతో మట్టిపాలుచెయ్యాలి? అప్రయత్నంగా తనకి లభించనున్న స్వర్గసౌఖ్యాన్ని, మధుర మయ ఘడియల్ని తన బుద్ధిపూర్వకంగా, గుడ్డిగా యెందుకు నాశనంచేసికోవాలి?

నిలువుటద్దంలో తన బింబాన్ని చూసికొని తనేమురిసిపోయింది శశి. ముఖంపై అడ్డంగా యిటూ అటూ పడే కురుల్ని సర్దుకుంటూ చిన్నగా, సన్నగా నవ్వుకుంది. టేబిలుపై వున్న 'నైట్ క్వీన్' బుడ్డీ తీసి బట్టలమీదా, వంటిమీదా మరింత చిలకరించుకొంది. తర్వాత అడుగుపై అడుగేసుకుంటూ వరండా వైపు నడిచింది.

చిటపట చినుకులతో ప్రారంభమైనవర్షం కుంభవృష్టిగా కురియసాగింది. ఉరుములూ మెరుపులూ భయంకరంగా వున్నాయ్.

చలికి నిద్రపట్టకండా అవస్థపడుతున్న జయరాం, తలుపుతెరిచిన చప్పుడువిని అటువైపు చూసేడు. నైటుక్వీన్ మల్లెల మిశ్రమ సౌరభంతో ముక్కుమూసుకపోయింది. అతని సందేహం తీరిపోయింది. కళ్ళు సగం మూసి నిద్ర నటించాడు.

గాజులు గలగలమన్నాయ్. అడుగులు చప్పుడయింది. వెనువెంటనే జయరాం నుదుటిపై చల్లని, మెత్తని చెయ్యిపడింది. చేతివ్రేళ్ళు భయంతో వణుకుతున్నాయికూడా.

జయరాం సంగతి యిట్టే గ్రహించాడు. మెల్లగా కళ్ళువిప్పి ఆమె కళ్ళలోకిచూసేడు. తళుక్కుమని మెఱుపు మెరిసింది. ఆమె ఆదోరకంగా తనవంకే చూస్తూ వుంది. ఆ చూపుల్ని చంటిపిల్లాడూ, నపుంసకులూకూడ తెలిసికోగలరు. ఇంక ఐదారేళ్ళ అనుభవం గల తనకి చెప్పాలా?

అతను, తనబలమైనచేతుల్ని ఆమె సన్నని నడుంచుట్టూ పోనిచ్చి, ఆమె యెత్తయిన వక్షోజాల్ని తన హృదయానికి హత్తుకున్నాడు. శశి తన నాజూకయిన చేతులతో అతని మెడ కావిలించుకుని. గులాబిరేకుల్లాంటి తన పెదాలని అతనినోటిలో వుంచుతూ—కంపిస్తున్న కంఠంతో "ఇక్కడకాదు...... లోపల—" అన్నది.

అప్పుడే రైల్వేషెడ్డులో ఒంటిగంట కొట్టేరు.